
# కత్తిరింపు

పి. గణపతిశాస్త్రి




**విశ్వనాథం** విజయవాడ నుంచి భద్రాద్రికి బయులుదేరాడు. ఆ మరునాడే శ్రీరామ నవమి. ఆ సందర్భంలో స్వామికి కళ్యాణ మహోత్సవం జరిపించాలని చాలా కాలం నుండి సంకల్పించుకున్నాడు విశ్వనాథం. నిజానికి శ్రీరామనవమి నాడు కళ్యాణ మహోత్సవం జరిపించడం చాలా శ్రమతో కూడిన పని. అయినా కొంచెం ఆలస్యమయినా ఆ నాడే ఆ కళ్యాణం జరిపించి తీరాలని విశ్వనాథం తీర్మానించుకున్నాడు.

కాని, విపరీతమైన జనం రద్దీలో అతని కదిసాధ్యపడే టట్లు కనబడ లేదు. కాని, తీరా కళ్యాణ మహోత్సవానికి కావలిసిన సొమ్ము చెల్లించే సందర్భంలో అతడు తన లాల్చీ, అడుగున ఉన్న బనీను జేబు ఎవరో మిక్కిలి చాక చక్యంతో కత్తిరించి పర్సు దొంగిలించినట్లు తెలుసుకున్నాడు.

దానిలో నాలుగు వందల రూపాయలు ఉన్నాయి. అంత సొమ్ము ఆ విధంగా ఒక్కసారిగా పోయినందుకు విశ్వనాథం నిలువునా దిగాలు పడ్డాడు. అతనికి ముచ్చెమటలు పోశాయి. లాల్చీ జేబు అడుగున ఉన్న బనీను జేబు తడిమి చూసుకుంటూనే ఉన్నాడు. విపరీతమైన జనం రద్దీలో ఏ డెనిమిది నిమిషాల పాటు మాత్రమే అది సాధ్య పడలేదు.

ఎవరో మిక్కిలి చాకచక్యంతో తన కే మాత్రము తెలియనంతటి మెళకువతో ఆ జేబు కత్తిరించి ఆ పర్సు కాస్తా ఇట్టే కాజేశారు. ఆ చాకచక్యం గమనించిన తరవాత ఆ దొంగ హస్తలాఘవం అతని కెంతైనా ఆశ్చర్యం కలిగించింది.

నిజానికి విశ్వనాథం అంతగా సొమ్మున్న వాడు కాడు. అతను విజయవాడలో హైస్కూలులో టీచరుగా పని చేస్తున్నాడు. ఆ ఉద్యోగం వల్ల అతని సంసారం అతి కష్టం మీద ముందుకు సాగుతున్నది. ఆ పైన

